సాక్షి
విశాఖపట్నం
ఆదివారం । 21 । జూలై । 2024


అడవివరం ప్రధాన మార్గంలో రథోత్సవం, కిక్కిరిసిన భక్తజనం

అప్పన్న సన్నిధికి

అడుగులో అడుగేస్తూ..

గిరి ప్రదక్షిణకు పోటెత్తిన భక్తులు




తొలిపావంచా వద్ద కొబ్బరికాయలు కొడుతున్న భక్తులు


గంగిరెద్దుకి నమస్కరిస్తున్న భక్తులు

- వర్షం తెరిపివ్వడంతో తరలివచ్చిన భక్తులు
- ఉదయం 7 గంటల నుంచే ప్రదక్షిణ ప్రారంభించిన భక్తజనం
- సాయంత్రం 4 గంటలకు పుష్పరథం ప్రారంభం


ఎంవీపీ డబుల్ రోడ్డులో భక్తజన సందోహం

సింహాచలం: సింహగిరి ప్రదక్షిణ శనివారం వైభవంగా జరిగింది. 32 కి.మీ గిరి ప్రదక్షిణకు భక్తులు పోటెత్తారు. ఉదయం 7 గంటల నుంచే తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా రాష్ట్రం నుంచి భక్తులు తరలివచ్చారు. తొలిపావంచా నుంచి ప్రదక్షిణ ప్రారంభించిన భక్తులు అడవివరం, పైనాపిల్‌కాలనీ, సెంట్రల్ జైలు, హనుమంతవాక, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం, తెన్నేటి పార్కు, అప్పుఘర్, ఎంవీపీకాలనీ, సీతమ్మధార, నరసింహనగర్,


పుష్పరథ యాత్ర ప్రారంభిస్తున్న అశోక్ గజపతిరాజు

డీఎల్‌బీ క్వార్టర్స్, కప్పరాడ, మురళీనగర్, మాధవధార, ఆర్‌అండ్‌బీ కార్యాలయం, లక్ష్మీనగర్, కుమారి కల్యాణమండపం, ప్రహ్లాదపురం మీదుగా తిరిగి సింహాచలం చేరుకున్నారు. వర్షం తెరిపివ్వడంతో భక్తులు ఉత్సాహంగా ప్రదక్షిణ చేశారు.

విశేషంగా రథయాత్ర

కొండదిగువ స్వామివారి తొలిపావంచా వద్ద శనివారం సాయంత్రం 4 గంటలకు రథోత్సవం ప్రారంభమైంది. దేవస్థానం స్థానాచార్యులు టి.పి. రాజగోపాల్, ప్రధానార్చకులు శ్రీనివాసాచార్యులు, రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు రథంలో ఉన్న స్వామికి పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థానం **అనువంశిక** ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతి**రాజు జెండా** ఊపి రథోత్సవాన్ని ప్రారంభించా**రు. ఆ సమ**యానికి తొలిపావంచా వద్దకు **చేరు**కున్న భక్తులు స్వామినామస్మర**ణ** చేస్తూ రథాన్ని అనుసరించారు. **తొలి**పావంచా నుంచి ప్రారంభ**మైన** రథయాత్ర అడవివరం, పైనాపి**ల్‌కాల**నీ, సెంట్రల్ జైల్, హనుమంత**వాక,** విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలె**ం,** తెన్నేటిపార్కు, అప్పుఘర్, ఎంవీపీ కాలనీ, వెంకోజీపాలెం, సత్యం జంక్షన్, ఎన్‌ఏడీ కొత్త రోడ్డు, గోపాలపట్నం, ప్రహ్లా**ద**పురం మీదుగా తిరిగి సింహా**చలం** చేరుకుంది. రథోత్సవంలో దేవ**స్థానం** ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. పులివేషాలు, కేరళ డ్రమ్స్, కోలాటం, కాళీ నృత్యాలు ఆకట్టుకున్నాయి.



స్వచ్ఛంద సంస్థల సాయం

గిరి ప్రదక్షిణని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్, దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో అన్ని శాఖల సమన్వయం**తో** ఏర్పాట్లు చేశారు. గిరిప్రద**క్షిణ జ**రిగే 32 కి.మీ కొం**డచుట్టూ** 29 ప్రదేశాల్లో **భక్తులు** విశ్రాంతి తీసుకునేం**దుకు** స్టాల్స్ ఏర్పాటు **చే**శారు. అక్కడ జీవీఎంసీ తాగునీరు అందుబాటులో ఉంచింది. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో 11 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. 29 స్టాల్స్‌లో భక్తులకు మందులు అందజేశారు. 22 ప్రదేశాల్లో మహిళలు, పురుషులకు వేర్వేరుగా 290 తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. 17 అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆధ్వర్యంలో 2,600 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. దారిపొడవునా స్వచ్ఛంద సంస్థలు భక్తులకు ఆహార పదార్థాలు, స్నాక్స్, పానీయాలు అందజేశాయి.

సైడ్ లైట్స్

- గిరి ప్రదక్షిణకు ఉదయం 7 గంటల నుంచే భక్తులు సింహాచలం చేరుకున్నారు. వర్షం తెరిపివ్వడంతో ఉదయం 10 గంటల నుంచి ఒక్కసారిగా రద్దీ పెరిగింది. మధ్యాహ్నం సమయానికి విపరీతంగా రద్దీ నెలకొంది. రథోత్సవం సమయానికి స్వామివారి తొలిపావంచా నుంచి పాత అడవివరం జంక్షన్ వరకు భక్తులు కిక్కిరిశారు.
- ఉదయం 7 గంటలకే ప్రదక్షిణ ప్రారంభించిన పలువురు భక్తులు సాయంత్రం 6 గంటలకే తిరిగి సింహాచలం చేరుకున్నారు. అలా చేరుకున్న వారందరికీ రాత్రి 10 గంటల వరకు సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామివారి దర్శనాలు కల్పించారు.
- తొలిపావంచా వద్ద కొబ్బరికాయలు కొట్టే భక్తుల సౌకర్యార్థం ఈసారి 50 వరకు క్యూలు, 80 ఇనుప గద్దర్లు ఏర్పాటు చేశారు.
- కొత్త ఘాట్‌రోడ్డు వద్ద కొబ్బరి కాయలు కొట్టేందుకు 20 వరకు గద్దర్లు ఏర్పాటు చేసినా అక్కడ కొబ్బరికాయలు కొట్టేందుకు భక్తులు పెద్దగా ఆసక్తి చూపలేదు.
- తొలిపావంచా వద్ద ఎప్పటికప్పుడు కొబ్బరి చెక్కలు తరలించేందుకు క్రేనులు, పెద్ద సంఖ్యలో లారీలు ఏర్పాటు చేశారు.
- తొలిపావంచా వద్ద తీవ్ర రద్దీ నెలకొనడంతో భక్తులు రోడ్లపైనా, దేవస్థానం బస్టాండ్‌లోని బీఆర్‌టీఎస్ రోడ్డు సరిహద్దు గోడపైనా కొబ్బరికాయలు కొట్టారు.
- నగరంలో నుంచి గోపాలపట్నం మీదుగా పాత గోశాల వైపు వచ్చే వాహనాలను పాతగోశాల జంక్షన్‌కి సమీపంలో నిలుపుచేశారు. అక్కడి నుంచి తొలిపావంచా వద్దకు భక్తులు నడిచి వెళ్లారు. మధ్యాహ్నం నుంచి మరింత రద్దీ ఏర్పడటంతో గోపాలపట్నం నుంచి, వేపగుంట నుంచి కూడా సింహాచలం వరకు అధిక సంఖ్యలో భక్తులు నడిచి వెళ్లాల్సి వచ్చింది.
- ఈసారి బీఆర్‌టీఎస్ రోడ్డు విశాలంగా ఉండటంతో అడవివరం వైపు వచ్చే భక్తులందరినీ తొలిపావంచాకి ప్రధాన మార్గంలోనే పంపించారు.

అప్పుఘర్‌లో స్నానాలు లేవు

గిరిప్రదక్షిణకు వచ్చే భక్తులతో అప్పుఘర్ తీరం పోటెత్తింది. వాతావరణ ప్రభావంతో అలల ఉధృతంగా వస్తున్న కారణంగా ఈ ఏడాది భక్తులను సముద్ర స్నానానికి అనుమతించలేదు. గజ ఈతగాళ్లు అందించే సముద్ర నీరును భక్తులు తలపై చల్లుకుని వెనుదిరిగారు. అలాగే మాధవధారలో ఉన్న మాధవస్వామిని భక్తులు దర్శించుకున్నారు. పలువురు భక్తులు ఆలయం వద్ద స్నానాలు ఆచరించారు.

తలపై నీళ్లు చల్లుకుంటున్న భక్తులు



భద్రత ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న సీపీ బాగ్చి


తొలి పావంచా వద్ద స్వామికి నమస్కరిస్తూ..




అప్పుఘర్ వద్ద ప్రసాద వితరణ

న్యూస్‌రీల్

జీవీఎంసీ కమిషనర్‌గా సంపత్‌కుమార్



సాక్షి, విశాఖపట్నం: జీవీఎంసీ కమిషనర్‌గా పి.సంపత్‌కుమార్‌ని నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. 2016 బ్యాచ్‌కు చెందిన సంపత్‌కుమార్ ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లా జేసీగా విధులు నిర్వర్తిస్తున్నారు. సాయికాంత్ వర్మని బదిలీ చేసిన తర్వాత జీవీఎంసీ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. ఇప్పుడు పూర్తిస్థాయిలో కమిషనర్‌ని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా విశ్వనాథన్

వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా ప్రస్తుతం జీవీఎంసీ అదనపు కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న కె.ఎస్.విశ్వనాథన్ నియమించారు. ఆయన గతంలో విశాఖ జేసీగా పనిచేశారు. అలాగే గిరిజన సహకార సంస్థ(జీసీసీ) ఎండీగా కల్పనా కుమారిని నియమించారు. ప్రస్తుతం జీసీసీ ఎండీగా విధులు నిర్వర్తిసున్న జి.సురేష్‌కుమార్‌ని బదిలీ చేశారు. రంపచోడవరం ఐటీడీఏ పీవోగా కట్టా సింహాచలంను, అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా సచివాలయాల అదనపు డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న అభిషేక్ గౌడను నియమించారు.

కేకే లైన్‌లో రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం: భారీ వర్షాలు, ప్రతికూల వాతావరణం కారణంగా కేకే(కొత్తవలస–కిరండూల్) లైన్‌లో నడిచే పలు రైళ్ల గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు.

- విశాఖపట్నం–కిరండూల్(08551) పాసింజర్ స్పెషల్ ఈ నెల 21, 22వ తేదీల్లో దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. 21, 22, 23వ తేదీల్లో కిరండూల్–విశాఖపట్నం (08552) పాసింజర్ స్పెషల్ దంతేవాడ నుంచి బయలుదేరుతుంది.
- విశాఖపట్నం–కిరండూల్(18514) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 22, 23వ తేదీల్లో మళ్లించిన మార్గంలో వయా విజయనగరం, రాయగడ, కోరాపుట్ మీదుగా దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. 21, 22, 23వ తేదీల్లో కిరండూల్–విశాఖపట్నం (18513) నైట్ ఎక్స్‌ప్రెస్ దంతేవాడ నుంచి బయలుదేరి మళ్లించబడిన మార్గంలో వయా కోరాపుట్, రాయగడ, విజయనగరం మీదుగా విశాఖపట్నం చేరుకుంటుంది.

విశాఖ ఆశా 'జ్యోతి'

- అవరోధాలను అధిగమిస్తూ ఒలింపిక్స్‌కు జ్యోతి యర్రాజి అర్హత
- పతకంతో తిరిగి రావాలని విశాఖవాసుల ఆకాంక్ష



విశాఖ స్పోర్ట్స్: ఎటువంటి క్రీడా నేపథ్యం లేని కుటుంబంలోంచి వచ్చిన విశాఖ అమ్మాయి.. నేడు ప్రపంచ క్రీడా పోటీల వేదికైన ఒలింపిక్స్‌కు దేశం తరఫున పాల్గొంటోంది. ఓ వైపు గాయాలు వెంటాడినా.. కరోనా సమయంలో పరుగుకు దూరమైనా.. ఆమె ఆగిపోలేదు. పరుగు ఆపలేదు. అవరోధాలను అధిగమిస్తూ.. రికార్డుల మీద రికార్డులు సాధించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు కొల్లగొట్టింది. తన కలను సాకారం చేసుకునేందుకు పారిస్ బయలుదేరింది. ఆమే విశాఖ పరుగుల బుల్లెట్ జ్యోతి యర్రాజి.

ఆర్థికంగా స్థిరమైన స్థితిలో లేకున్నా.. చిరుప్రాయంలోనే ఆటలపై ఆసక్తి పెంచుకుంది జ్యోతి. జాతీయస్థాయిలో రాణించాలని ఆశించింది. నాన్న సెక్యూరిటీ గార్డు. అమ్మ ఇళ్లలో సహాయక పనులు చేసేది. అసలు ఏ పోటీల్లో ఎలా పాల్గొవాలో తెలియని స్థితి నుంచి.. అథ్లెటిక్ అంశాలు వంద, రెండు వందలు, రిలే ఇలా పలు అంశాల్లో పోటీకి దిగింది. ఏకంగా వంద మీటర్ల హార్డిల్స్‌లో తన జాతీయ రికార్డులను తనే తిరగరాసింది. 20 ఏళ్ల నుంచి ఉన్న 13.38 సెకన్ల రికార్డును చెరిపేసి 13.23 సెకన్లతో జాతీయ రికార్డును నెలకొల్పిన విశాఖ హార్డిలర్ జ్యోతి.. పారిస్ ఒలింపిక్స్‌కు సిద్ధమైంది. అదీ వంద మీటర్ల హార్డిల్స్ వ్యక్తిగత అంశం. ఈ ఒలింపిక్స్‌లో మొత్తంగా దేశం తరఫున 117 మంది అథ్లెట్లు 16 క్రీడాంశాల్లో పాల్గొంటుండగా వారిలో 18 మంది అథ్లెటిక్స్ (మొత్తంగా 47 మంది) మహిళా క్రీడాకారిణులు. 2022లో వంద మీటర్లను 13 సెకన్లలోనే పూర్తి చేసి రికార్డు సాధించిన జ్యోతి నాటి నుంచి ఒలింపిక్స్ లక్ష్యంగా అవరోధాలను అధిగమించింది. ఆ క్రమంలో ఒలింపిక్స్ అర్హత పోటీల్లో పతకాలతో రాణించింది. వ్యక్తిగత అంశంలో తలపడనున్న ప్రస్తుత నేషనల్ చాంపియన్ జ్యోతి.. ప్రపంచంలోని మహిళల 100 మీటర్ల హార్డిల్స్ ర్యాంకింగ్‌లో 24వ స్థానంలో ఉంది.

అంతర్జాతీయ క్రీడా పోటీల్లో ..

కోయంబత్తూర్‌లో జరిగిన జాతీయ స్థాయి 2016 పోటీల్లో తొలిసారిగా పాల్గొన్న జ్యోతి 14.92 సెకన్లలో వంద మీటర్ల హార్డిల్స్‌ను పూర్తి చేసింది. అదే ఏడాది 13.06 సెకన్లతో, గతేడాది జాతీయ చాంపియన్‌షిప్‌లో 12.92 సెకన్లతో చాంపియన్‌గా నిలిచింది. గతేడాది వంద మీటర్ల పరుగును 11.46 సెకన్లలో పూర్తి చేసినా ఈ సారి వంద మీటర్ల హార్డిల్స్‌పైనే దృష్టి పెట్టింది. ఆసియన్ ఇండోర్ చాంపియన్‌షిప్‌లో రజత పతకాన్ని సాధించిన జ్యోతి కామన్‌వెల్త్ క్రీడల్లో(రిలేలో నాలుగోస్థానం) ఎనిమిదో స్థానంలో, వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్‌లో కాంస్య పతకాన్ని సాధించింది. బుడాపెస్ట్‌లో జరిగిన వరల్డ్ చాంపియన్‌షిప్‌లో 100 మీటర్ల హార్డిల్‌ను 13.05తో పూర్తి చేసింది. ఆసియన్ గేమ్స్‌లో 12.91తో ద్వితీయస్థానంలో నిలిచింది. ఇది తన కెరీర్‌లోనే హైలెట్‌గా నిలిచింది. 2022లో జరిగిన జాతీయ క్రీడల్లో వంద, వంద మీటర్ల హార్డిల్స్ రెండింటా స్వర్ణాలు సాధించింది. అదే ఏడాది 100 మీటర్ల మహిళల హార్డిల్స్‌లో 13 సెకన్ల కంటే తక్కువ సమయంలో పూర్తి చేసిన భారతీయ మహిళా హార్డిలర్‌గా నిలిచింది. 2023 ప్రారంభంలో కజకిస్తాన్‌లోని ఆస్తానాలో జరిగిన ఆసియా ఇండోర్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో రజతంతో పాటు జాతీయ రికార్డును మరోసారి బద్దలు చేసింది.

పతకమే లక్ష్యంగా..

2019లో గుంటూరులోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో చేరినా.. 2020 తర్వాత బ్రేక్ వచ్చింది. పడి లేచిన కెరటంలా భువనేశ్వర్‌లోని రిలయన్స్ అథ్లెటిక్స్ హై పర్‌ఫార్మెన్స్ సెంటర్‌లో శిక్షణకు ఎంపికైంది. బ్రిటిష్ కోచ్ జేమ్స్ హిల్లియర్ వద్ద శిక్షణ తీసుకుంటూ.. డైట్ మెరుగుపరుచుకుంటూ తన హార్డిల్ క్లియరెన్స్‌ను 12.78 సెకన్లలోనే పూర్తి చేసే స్థాయికి చేరుకుంది. అథ్లెటిక్స్‌లో భారత్‌కు పతకం అందించాలనే ఆకాంక్షతో పారిస్ ఒలింపిక్స్‌కు పయనమైంది. జ్యోతి యర్రాజి మన దేశానికి గర్వకారణం. ఆమె విజయాలు మనందరికీ ఓ ప్రేరణ. ఒలింపిక్స్‌లో పతకం సాధించి విశాఖ కీర్తిని ప్రపంచ పటంపై ఎగురవేయాలని కోరుకుందాం. ఆల్ ద బెస్ట్ జ్యోతి.

ప్రత్యేక శిక్షణ పొందుతున్నా..



ఒలింపిక్స్‌కు అర్హత సాధించడం నా కల. ఇప్పుడు అది నెరవేరింది. ఈ స్థాయికి రావడానికి ఎంతో కష్టపడ్డాను. ప్రస్తుతం భారత్ అథ్లెటిక్స్ కాంటింజెంట్‌తో శిక్షణ శిబిరాల్లో ఉన్నాను. పోలాండ్‌లో శిక్షణ జరుగుతోంది. ఇక్కడ నుంచే నేరుగా పారిస్ వెళ్లిపోతాం. ఒలింపిక్స్ గేమ్స్ ఈనెల 26 నుంచి ప్రారంభం కానున్నాయి. మా అథ్లెటిక్ అంశాలు ఆగస్టు ఒకటో తేదీ నుంచి ప్రారంభమవుతాయి. నా వంద మీటర్ల హార్డిల్స్ హీట్స్ తొలి రౌండ్ ఏడో తేదీన జరగనుంది. పతకం సాధించాలనే పట్టుదలతో ఉన్నాను.

\- జ్యోతి యర్రాజి

తహసీల్దార్లు వెనక్కిరావడానికి వర్షం అడ్డంకి!

మహారాణిపేట: సార్వత్రిక ఎన్నికల సమయంలో జిల్లా నుంచి ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన 19 మంది తహసీల్దార్లు వెనక్కి వచ్చే ప్రక్రియకు తుపాను అడ్డంకిగా మారింది. తహసీల్దార్లు తిరిగి సొంత జిల్లాలకు రావడానికి ముఖ్య భూ పరిపాలన కమిషనర్ (సీసీఎల్‌ఏ) అనుమతిచ్చిన సంగతి తెలిసిందే. అయితే మూడు రోజులుగా జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో తహసీల్దార్లు రిలీవ్ కావడానికి సాంకేతిక సమస్య ఎదురైంది. ఈ సమయంలో తహసీల్దార్లు రిలీవ్ అయితే కొత్త వారు రావడం, విధుల్లో చేరడానికి రెండు, మూడు రోజులు పడుతుంది. ఈ నేపథ్యంలో వర్షాలు తగ్గిన తర్వాత సోమవారం విధుల నుంచి రిలీవ్ చేసే విషయాన్ని అధికార యంత్రాంగం పరిశీలిస్తోంది.

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ ఏడాది జనవరి 31న విశాఖ నుంచి మొత్తం 19 మందిలో 9 మంది పార్వతీపురం మన్యం జిల్లాకు, 9 మంది విజయనగరం జిల్లాకు, ఒకరు శ్రీకాకుళం జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయా జిల్లాల నుంచి 19 మంది తహసీల్దార్లు విశాఖలో విధుల్లో చేరిన సంగతి తెలిసిందే.

డీసీపీ–1గా అజితా వేజెండ్ల బాధ్యతల స్వీకరణ



తాటిచెట్లపాలెం: నగర డీసీపీ–1(లా అండ్ ఆర్డర్)గా అజితా వేజెండ్ల శనివారం కమిషనరేట్‌లోని లా అండ్ ఆర్డర్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. 2015 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఆమె పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీగా బాధ్యతలు నిర్వర్తించి.. బదిలీపై విశాఖకు వచ్చారు. గతంలో ఆమె నగర ఎస్‌ఈబీలో ఏడీసీపీగా పనిచేశారు.

సెయిల్‌లో స్టీల్‌ప్లాంట్ విలీనం చేయాలి

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడికి వినతి

ఉక్కునగరం: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ శనివారం స్టీల్‌ప్లాంట్‌లో పర్యటించారు. ముందుగా ఆయన స్టీల్‌ప్లాంట్ ఈడీ(వర్క్స్) బిల్డింగ్‌లోని మోడల్ రూమ్‌కు చేరుకున్నారు. అక్కడ ఆయనకు ఉన్నతాధికారులు ప్లాంట్ లే అవుట్, ఉత్పత్తి ప్రక్రియ, ముడి పదార్థాలు, ఉత్పత్తుల రవాణా గురించి వివరించారు. అనంతరం ఆయన ప్లాంట్‌లో కొన్ని ప్రధాన విభాగాలను సందర్శించి అక్కడ ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఉక్కు హెచ్‌ఆర్‌డీ సెంటర్‌లో స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు ఆయనకు వినతిపత్రం అందజేశారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, ఎస్సీ, ఎస్టీ అధికారుల పదోన్నతుల్లో జాప్యం జరుగుతోందని, విభాగాధిపతులుగా ఎస్టీ అధికారులను నియమించాలని, కాంట్రాక్ట్ పోస్టుల్లో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు అమలు చేయాలని, ఎస్సీ, ఎస్టీలకు జీవో పదోన్నతులు కల్పించాలని, ఏకలవ్య విగ్రహం ఏర్పాటు చేయాలని అందులో పేర్కొన్నారు. అనంతరం యాజమాన్యంతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సీఎండీ అతుల్ భట్ ఎస్సీ, ఎస్టీ సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. డైరెక్టర్లు ఎ.కె.బాగ్చి, ఎస్.సి.పాండే, గణేష్, జి.వి.ఎన్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


పోర్టు ఉద్యోగులతో మాట్లాడుతున్న జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ జాటోతు హుస్సేన్

పోర్టు సందర్శన

సాక్షి, విశాఖపట్నం: ప్రతి సంస్థలోనూ ఉద్యోగులకు సమగ్ర సౌకర్యాలు కల్పించేందుకు యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ సూచించారు. తెలంగాణ, ఏపీ ఎస్టీ కమిషన్ మెంబర్ పీఎస్ అశోక్ కుమార్ లక్కార్స్, కమిషన్ మెంబర్ సలహాదారు పి.వి.రమణతో కలిసి హుస్సేన్ విశాఖపట్నం పోర్టులో శనివారం పర్యటించారు. పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ కుమార్ దూబే కమిషన్ బృందానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోర్టులో జరుగుతున్న ఎగుమతులు దిగుమతులు, మౌలిక వసతుల కల్పన, యాంత్రీకరణ, ఆధునికీకరణ, ఎస్టీ కమ్యూనిటి కోసం వినియోగిస్తున్న సీఎస్సార్ నిధుల వివరాలు తదితర అంశాలను డిప్యూటీ చైర్మన్ దూబే.. కమిషన్ బృందానికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం పోర్టులోని ఎస్టీ ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో కమిషన్ మెంబర్ హుస్సేన్ సమావేశమయ్యారు.

కేజీహెచ్‌లో పీటీయూ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ప్రారంభం

మహారాణిపేట: అనవసరమైన గర్భసంచి తొలగింపు శస్త్రచికిత్సలను తగ్గించడానికి, మహిళల ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి ప్రిజర్వ్ ద యుటెరస్ (పీటీయూ) సెంటర్ ప్రారంభించడం మంచి పరిణామమని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ అన్నారు. కేజీహెచ్‌లో పీటీయూ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. హిస్టెక్టమీని ఎదుర్కొనేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, బేయర్ ఫార్మాస్యూటికల్స్ డివిజన్, ఫెడరేషన్ ఆఫ్ ఆబ్‌స్టెట్రిక్ అండ్ గైనకాలజికల్ సొసైటీస్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌ఓజీఎస్‌ఐ) భాగస్వామ్యంతో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శివానంద్ మాట్లాడుతూ వైజాగ్‌లోని పీటీయూ సెంటర్స్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ దేశంలోనే మొదటిదన్నారు. ఈ ఆరోగ్య సవాల్‌ను ఎదుర్కోవడంలో తాము ముందున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. అధిక రక్తస్రావం వంటి పరిస్థితులకు చికిత్స చేయడంలో హిస్టెక్టమీ చివరి అవకాశంగా నిలిచేలా చేసేందుకు ఈ శిక్షణ కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. బేయర్స్ ఫార్మాస్యూటికల్స్ విభాగం దక్షిణాసియా మేనేజింగ్ డైరెక్టర్, ఇండియా అండ్ కంట్రీ డివిజన్ హెడ్ శ్వేతా రాయ్ మాట్లాడుతూ భారతదేశంలో అనవసరమైన గర్భాశయ శస్త్రచికిత్సల ప్రతికూల ప్రభావం గురించి అవగాహన కల్పించడం ఈ కార్యక్రమ లక్ష్యం అన్నారు. ఎఫ్‌ఓజీఎస్‌ఐ పబ్లిక్ అవేర్‌నెస్ కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ ప్రియాంకుర్ రాయ్, కేజీహెచ్ గైనిక్ విభాగాధిపతి డాక్టర్ సంధ్యాదేవి, విక్టోరియా ఆస్పత్రి గైనిక్ వైద్యురాలు డాక్టర్ గీతావందన, అంకో గైనకాలజిస్ట్ డాక్టర్ సాయి లక్ష్మి సెషన్లకు నాయకత్వం వహించారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్


వడివడిగా అడుగులేస్తూ..

• గిరి దారిలో భక్తులు మురిసె..


స్వామి సేవలో బుజ్జాయిలు.. కుటుంబ సభ్యుల తోడుగా..


అడుగులన్నీ సింహాచలం వైపే..


ఉత్తరాంధ్ర వైభోగం.. తప్పెటగుళ్ల ప్రదర్శన


ప్రత్యేక ఆకర్షణగా వేషధారణలు

ట్రాఫిక్ జామ్‌తో జనం ఇక్కట్లు

గోపాలపట్నం ప్రాంతంలో ట్రాఫిక్ జామ్ అయింది. ఇక్కడ బంక్ జంక్షన్ వద్ద సింహాచలం వెళ్లే రహదారిని మూసివేయడంతో ఇబ్బందులు తలెత్తాయి. నాలుగు వైపుల నుంచి గిరి ప్రదక్షిణకు ఆటోల్లో వచ్చే భక్తులను సింహాచలం రోడ్డులోకి అనుమతించకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం 5 గంటలకు ఈ రద్దీ ఎన్ఏడీ ఫ్లైఓవర్‌ను తాకింది. ఇలాంటి పరిస్థితి గతంలో ఎప్పుడూ చూడలేదని స్థానికులు చెబుతున్నారు.


గోపాలపట్నం బంక్ జంక్షన్‌లో నిలిచిన వాహనాలు

అడవివరం కూడలిలో తోపులాట


అడవివరం వద్ద తోపులాటలో భక్తుల ఇక్కట్లు | తోపులాట జరగడంతో బయటకు పరుగులు తీస్తున్న భక్తులు

సింహాచలం: గిరి ప్రదక్షిణ సందర్భంగా నిర్వహించిన రథోత్సవంలో అడవివరం కూడలి వద్ద భక్తులు ఇబ్బందులు పడ్డారు. రథోత్సవం అడవివరం కూడలికి చేరిన సమయంలో ఒక్కసారిగా భక్తుల మధ్య తోపులాట జరిగింది.దీంతో కొందరు భక్తులు భయంతో పరుగులు తీశారు. దీనికితోడు రెండు రోడ్లు భక్తులతో నిండిపోవడంతో వేరే మార్గం కానరాక పలువురు భక్తులు బెంబేలెత్తిపోయారు. వాహనాలను తీసుకునేందుకు కూడా భక్తులు ఇబ్బందులు పడ్డారు. ఇంత జరుగుతున్నా పోలీసులు, ఇతర అధికారులెవరూ పట్టించుకోలేదు.

భక్తులకు సీఎంఆర్ ప్రసాద వితరణ

తాటిచెట్లపాలెం: గిరి భక్తులకు సీఎంఆర్ ఆధ్వర్యంలో కేఆర్ఎం కాలనీ, సీతమ్మధారలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాన్ని సీఎంఆర్ ఫౌండర్, చైర్మన్ మావూరి వెంకటరమణ ప్రారంభించారు. భక్తులకు పైనాపిల్ కేసరి, చక్కెర పొంగలి, బిస్కెట్ ప్యాకెట్లు, టీ, బాదంమిల్క్ వంటివి అందించారు. స్వామి నమూనా ప్రతిమను ఏర్పాటు చేసి, భక్తులకు చందనం అందజేశారు. డైరెక్టర్లు మావూరి వెంకట పద్మావతి, మావూరి హారిక, జీఎం నూలు లింగమూర్తి పాల్గొన్నారు.


భక్తులకు ప్రసాదం అందిస్తున్న సీఎంఆర్ ప్రతినిధులు

ఘాట్‌రోడ్లలో భారీ వాహనాల నిషేధం

– రాత్రి 7 నుంచి ఉదయం 6 వరకు అమలు

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఘాట్‌రోడ్లలో భారీ వాహనాలు, బస్సులు, ప్రైవేట్ జీపులు, ఇతర వాహనాల రవాణాపై రాత్రి 7 నుంచి ఉదయం 6 గంటల వరకు నిషేధం అమలుజేస్తూ కలెక్టర్ దినేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. పాడేరు–వడ్డాది ఘాట్‌రోడ్డు, పాడేరు–చింతపల్లి రోడ్‌లో కొక్కిరాపల్లి ఘాట్, చింతపల్లి–నర్సీపట్నం రోడ్డులో లంబసింగి ఘాట్, రంపచోడవరం–చింతూరు ఘాట్‌రోడ్డు, ఎస్.కోట–అరకు ఘాట్ రోడ్డుల్లో వర్షాలు తగ్గే వరకు ఈ నిషేధం అమలులో ఉంటుందని తెలిపారు.

ఎగుమతుల్లో దువ్వాడ వీఎస్ఈజెడ్ పైపైకి..

- మొదటి త్రైమాసికంలో రూ.62,198 కోట్ల విలువైన వస్తుసేవల ఎగుమతులు
- దువ్వాడ వీఎస్ఈజెడ్ జోనల్ డీసీ శ్రీనివాస్ వెల్లడి

అగనంపూడి: దువ్వాడ వీఎస్ఈజెడ్ ఎగుమతుల్లో జెట్ స్పీడ్‌తో దూసుకుపోతుంది. గత ఏడాదితో పోల్చితే మొదటి త్రైమాసికంలో 18 శాతం వృద్ధి రేటు సాధించి దేశంలో అగ్రగామిగా నిలిచింది. శనివారం దువ్వాడ వీఎస్‌జెడ్ పరిపాలన భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జోనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ ముప్పాళ్ల శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు రూ.62,198 కోట్ల విలువైన సేవలను, వస్తు సేవలను ఎగుమతులు సాధించడం ద్వారా విదేశీ మారకద్రవ్యాన్ని రాబట్టినట్టు చెప్పారు. సేవల రూపంలో రూ.37,758 కోట్ల విదేశీ మారకద్రవ్యాన్ని, వస్తు సేవల రూపంలో రూ.24,439 కోట్ల విలువైన వస్తు సేవలను ఎగుమతులు సాధించినట్టు పేర్కొన్నారు. మొదటి క్వార్టర్‌లో ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల్లో మూడు ఎస్ఈజెడ్ యూనిట్లు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు, అలాగే రెండు ఎక్స్‌పోర్ట్ ఓరియంటెడ్ యూనిట్లు ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చాయని, వాటికి ఆమోదం తెలిపినట్టు పేర్కొన్నారు. వంద కోట్ల పెట్టుబడులు, 15 వందల మందికి ఉపాధి కల్పించే లక్ష్యంతో వీటిని నెలకొల్పడం జరుగుతుందని చెప్పారు. వీటిలో ఒకటి విశాఖ ఎస్ఈజెడ్‌లో ఏర్పాటు కానుండగా, మరొకటి తెలంగాణ రాష్ట్రంలో నెలకొల్పనున్నారని పేర్కొన్నారు. ఇప్పటివరకు వీఎస్‌జెడ్ ద్వారా రూ.1,12,276 కోట్ల పెట్టుబడులతో యూనిట్లు కొనసాగుతున్నాయని, వీటి ద్వారా 6,18,551 మందికి ఉపాధి కల్పించడం జరిగిందన్నారు.

చిన్నారిని విక్రయించేందుకు మహిళ యత్నం?


పోలీసుల అదుపులో చిన్నారితో మహిళ

సీతమ్మధార: రామాటాకీస్ ప్రాంతంలో చిన్నారిని విక్రయించేందుకు ప్రయత్నించిన ఓ మహిళను ద్వారకా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శనివారం రాత్రి ఓ మహిళ చిన్నారిని విక్రయించేందుకు యత్నిస్తుండగా.. స్థానికులకు అనుమానం కలిగింది. వెంటనే వారు డయల్ 100కు కాల్ చేసి.. ఈ విషయం తెలిపారు. దీంతో ద్వారకా పోలీసులు అక్కడకు చేరుకుని చిన్నారితో పాటు ఆమెను స్టేషన్‌కు తరలించారు. వివరాలు అడగ్గా.. చిన్నారి తన బిడ్డ అని, తన భర్త రోడ్డు ప్రమాదంలో చనిపోయాడని చెబుతోంది. ఆమె ఆరోగ్యం బాగాలేకపోవడంతో పోలీసులు మందులు తెప్పించారు. చిన్నారికి పాలు అందించి సపర్యలు చేశారు. ఆమె నుంచి వివరాలు సేకరిస్తున్నామని, ప్రస్తుతానికి హోంకు తరలించామని పోలీసులు తెలిపారు.

డీఎస్సీ ఉచిత శిక్షణ దరఖాస్తుకు 24 చివరి తేదీ

ఎంవీపీకాలనీ: డీఎస్సీ(ఎస్జీటీ) అభ్యర్థులకు ఉచిత శిక్షణ దరఖాస్తు గడువును సర్దార్ గౌతు లచ్చన్న బీసీ స్టడీ సర్కిల్ పొడిగించింది. ఈ మేరకు ఎంవీపీ కాలనీలోని స్టడీ సర్కిల్ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఈ శిక్షణకు అర్హులు. 200 మందిని శిక్షణకు ఎంపిక చేస్తారు. రెండు నెలల శిక్షణ సమయంలో రూ.3వేలు స్టైఫండ్, రూ.1000 విలువ చేసే స్టడీ మెటీరియల్‌ను అందజేస్తారు. సంబంధిత అర్హత పత్రాలతో దరఖాస్తులను ఈ నెల 24వ తేదీ సాయంత్రంలోపు అభ్యర్థులు ఎంవీపీ కాలనీలోని సంస్థ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది. పూర్తి వివరాలకు 94925 69177లో సంప్రదించవచ్చు.

విభిన్నమైన కథతో 'విరాజి'


మాట్లాడుతున్న హీరో వరుణ్ సందేశ్

బీచ్‌రోడ్డు: నేటితరం యువతను ఆకట్టుకునేలా విభిన్నమైన కథతో రూపొందించిన చిత్రం 'విరాజి'అని ఆ చిత్రం హీరో వరుణ్ సందేశ్ అన్నారు. నగరంలో శనివారం విరాజి యూనిట్ సందడి చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చిత్రం హర్రర్ ఎలిమెంట్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుందన్నారు. ప్రస్తుతం తాను నటనకు ఆస్కారం ఉండే పాత్రలనే ఎంపిక చేసుకుంటున్నానని, లవర్ బాయ్ పాత్రలకు తన వయసు దాటిపోయిందన్నారు. తనకు చిన్నప్పటి నుంచి విశాఖతో అనుబంధం ఉందన్నారు. సీతమ్మధారలోని అమ్మమ్మ ఇంట్లో సెలవులు గడిపానని గుర్తు చేసుకున్నారు. డైరెక్టర్ ఆదిత్య నాథ్ హర్ష మాట్లాడుతూ యాని పాత్రలో వరుణ్ నటన చాలా బాగుంటుందన్నారు. ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని చెప్పారు. నటి అపర్ణ కుషాలిని, నిర్మాత మహేంద్రనాథ్ పాల్గొన్నారు.

జర్నలిస్టులు వైద్య పరీక్షలు చేయించుకోవాలి

కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: డబ్ల్యూజేహెచ్ఎస్ పథకంలో భాగంగా జిల్లాలోని అర్హులైన జర్నలిస్టులందరూ త్వరితగతిన వైద్య పరీక్షలు చేయించుకోవాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సూచించారు. ఆరిలోవలోని అపోలో ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయిస్తున్నామని, ఇప్పటి వరకు 378 మంది పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు. మిగిలిన జర్నలిస్టులు వైద్యపరీక్షలు త్వరితగతిన చేయించుకోవాలని, ఈ ప్రక్రియ సజావుగా సాగేందుకు సమాచార పౌర సంబంధాల అధికారులు జర్నలిస్టులకు సహకారం అందించాలని సూచించారు. జూలై నెలాఖరు వరకు జిల్లాలోని జర్నలిస్టుల స్పందనను బట్టి ప్రక్రియను ఇంకా కొనసాగించాలా, వద్దా అనే అంశంపై తుది నిర్ణయం తీసుకుందామని ఆయన్ను కలిసిన సమాచార పౌర సంబంధాల అధికారులకు కలెక్టర్ సూచించారు.

కమనీయం.. నృత్యోత్సవం


డాక్టర్ గీతానారాయణ్, చిన్నారుల నాట్య విన్యాసాలు


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జీఎస్టీ అడిషనల్ కమిషనర్ మహ్మద్ అలీ, ఇన్‌కం ట్యాక్స్ అడిషనల్ కమిషనర్ శంకర్

మద్దిలపాలెం: సత్యభామ యువ నృత్యోత్సవం కార్యక్రమం వైభవోపేతంగా సాగుతోంది. నృత్య కళాకారిణులు అద్భుతమైన నాట్య విన్యాసాలతో ప్రేక్షకులను మైమరిపించారు. నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో కళాభారతి ఆడిటోరియంలో నిర్వహిస్తున్న రెండో కార్యక్రమాన్ని శనివారం జీఎస్టీ అడిషనల్ కమిషనర్ మహ్మద్ అలీ, ఇన్‌కంట్యాక్స్ అడిషనల్ కమిషనర్ శంకర్ పాండ్య, మాజీ ఐటీ కమిషనర్ సుదాగాని రవిశంకర్ నారాయణ్ ప్రారంభించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు 55 మంది కళాకారులు ప్రదర్శనలిచ్చారని అకాడమీ వ్యవస్థాపకుడు బత్తిన విక్రమ్ కుమార్ గౌడ్ తెలిపారు. అనంతరం యువ నృత్య కళాకారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పలు రాష్ట్రాల నృత్య దర్శకులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యవహారంలో అనిల్ అరెస్ట్

సీతమ్మధార: ఆపరేషన్ కోసం కిడ్నీలు ఏర్పాటు చేస్తానంటూ మోసం చేసిన కేసులో అనిల్‌ను ద్వారకా పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పెందుర్తి ప్రాంతానికి చెందిన సత్యనారాయణ గోపి తన భార్య శారద లక్ష్మి కిడ్నీ మార్పిడి కోసం ఎన్ఆర్ఐ ఆస్పత్రి వైద్యురాలు వాణిని సంప్రదించగా తన సహాయకుడు అనిల్‌తో మాట్లాడాలని చెప్పారు. వారు అతడిని కలవగా కిడ్నీ ఏర్పాటు చేస్తానని రూ. 10 లక్షల వరకు తీసుకున్నాడు. తర్వాత పట్టించుకోకపోవడంతో బాధితులు ద్వారకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం సీపీ దృష్టికి తీసుకువెళ్లడంతో ప్రత్యేక బృందాన్ని నియమించారు. ప్రత్యేక బృందం వద్ద అనిల్ నిజం ఒప్పుకోవడంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.